చూసేటప్పుడు కూడా అంతర్యామిగా ఉన్న భగవంతుడినేచూడండి. రూపదృష్టి, నామదృష్టి తగ్గించుకోండి. లోచూపు నేర్చుకొని హృదయంలోనికి చేరటానికి ప్రయత్నం చేయండి. హృదయంలోనికి చేరిన వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. కొంతమంది యజమాని మెప్పకోసం ఆయన ఎదురుగా పనిచేస్తున్నట్లు అటుఇటు తిరుగుతారు. ఏపని చేయరు. వారిని ఒకవేళ యజమాని మెచ్చుకొన్నా చివరకు మిగిలేది దుమ్మే. అసలు పనిచేసేవారు నిర్మలంగా పనిచేసుకొనిపోతారు, వారు భగవంతుని దయకు పాత్రులవుతారు. మనం చేసేపని నిర్మలంగా, నిశ్శబ్దంగా, కూల్‌గా చేయాలి, గుర్తింపుల కోసం చేయకూడదు. ఆత్మకు గుర్తింపులు అక్కరలేదు. అహంభావనకు గుర్తింపులు కావాలి. గుర్తింపులవలన అహంభావన పెరుగుతుంది. అంటే మనం ఏదైతే పోగొట్టుకోవాలో గుర్తింపుల వలన అది పెరుగుతుంది. నీలోపల ఒక సద్వస్తువు ఉంది. అది నీకు తెలియకపోయినా మనోదేహములు నీకు తెలుస్తున్నాయి. నీ మనోదేహములను లోపలఉన్న సద్వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఉపయోగించుకో. అది తెలుసుకోకుండా నీవు లోకంలో ఏది సాధించినా అవి అన్నీ స్వప్నంతో సమానము.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 5-1-03, లంకలకోడేరు**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం భక్తితో, శ్రద్ధతో, నమ్రతతో, త్రికరణశుద్ధిగా ఒక పని ప్రారంభించినప్పడు ప్రారంభంలో పెద్ద సహకారం లేకపోయినా స్లోగా స్టడీగా సహకారం అందుతుంది, అయితే మనం చేసే పని హృదయపూర్వకంగా చేయాలి, నిరాడంబరంగా చేయాలి, నిరహంకారముగా చేయాలి, అలాచేస్తే ఆపని సక్సెస్ అవుతుంది. మనం భౌతికరంగంలో కాని, ఆధ్యాత్మికరంగంలో కాని అభివృద్ధిలోనికి రావాలంటే ఆత్మవిశ్వాసం చాలాముఖ్యం. బాహ్యసంఘటనలు, పరిస్థితులు మనకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, వాటి ప్రభావం మన మెదడు మీద పడకుండా ఉండాలంటే మనకు ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఆత్మవిశ్వాసం లేకపోవటం వలన మనం మానసిక అనారోగ్యానికి గురవుతాము. మరణానంతరజీవితం మాట అటు ఉంచండి, ఇప్పడు మన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం కాపాడుకోవటానికి ఆత్మవిద్య ఎంతో ఉపయోగపడుతుంది. మన శరీరం ఉన్నంతసేపు ఎక్కడో ఒకచోట ఉండాలి. మనం ఎక్కడ ఉన్నా సమాజం ఉంటుంది. సమాజంలో అనేక సమస్యలు ఉంటాయి, కుటుంబపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి. ఆ సమస్యలను విడిచిపెట్టి పారిపోకుండా, ఆ సమస్యలను పరిష్కరించుకోవటానికి ఆత్మవిద్య సహకరిస్తుంది. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. మన ప్రాణానికి ప్రాణమై, మనస్సుకు మనస్సై, మనకు అతిసన్నిహితంగా భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు ఎక్కడో ఉన్నాడు అనుకోవటం కంటే మనకు సన్నిహితంగా మనలోనే ఉన్నాడు అని అనుకొంటే సాధనకు ఉపయోగపడుతుంది. భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడు,





కైలాసంలో ఉన్నాడు అని అలవాటు పడ్డాము. వైకుంఠం అంటే వికృతులు లేనిది, వికారములు లేనిది. మనం కూడా వికారములు లేకుండా, వికృతులు లేకుండా ఉంటే మన హృదయంలో ఉన్న వైకుంఠం ఇప్పడే మనకు వ్యక్తమవుతుంది. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని నీ హరి ఎక్కడ ఉన్నాడు అని అడిగితే హరి వైకుంఠంలో ఉన్నాడు అని చెప్పలేదు. అంతటా ఉన్నాడు అని ప్రహ్లాదుడు చెప్పాడు. అయితే ఈ స్థంబంలో ఉన్నాడా అని అడిగితే, అంతటా ఉన్నవాడు ఈ స్థంబంలో లేకుండా ఎలా ఉంటాడు అన్నాడు. అప్పడు గద పుచ్చుకొని ఆ స్థంబాన్ని కొడితే స్థంబంలో నుండి హరి వస్తాడు. అంతటా ఉన్నవాడు స్థంబంలో కూడా ఉన్నాడు, స్థంబంలో ఉన్నవాడు ఒక రూపాన్ని తీసుకొన్నాడు అంతే. మనం భవిష్యత్‌గురించి ఎక్కువ ఆలోచించి వర్తమానకాలాన్ని పాడుచేసుకొంటున్నాము. వర్తమానకాలాన్ని గాలికి వదిలేసి, వచ్చే సంవత్సరంలోఏదో వస్తుంది. ఆ సంవత్సరంలో ఏదో చేద్దాము అని ఆలోచించుకొంటూ ఉంటే ఇప్పడు ఈ సంవత్సరంలో ఉన్నాముకదా, ఈ కాలాన్ని ఉపయోగించుకోవాలి కదా. వర్తమానకాలాన్ని వదిలేసి భవిష్యత్‌కాలంగురించి ఆలోచించటం భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా మంచిది కాదు.

ఎక్కడికి వెళ్ళి చూసినా, ఏదేశం వెళ్ళినా ఏమీ లేదు, వింత ఏమీ లేదు. ఇక్కడ చిన్న మేడలు ఉండవచ్చు, అమెరికాలో పెద్ద పెద్ద మేడలు ఉండవచ్చు. ఇక్కడ వెల్త్ తక్కువ ఉండవచ్చు, అక్కడ వెల్త్ ఎక్కువఉండవచ్చుగాని మానవస్వభావం ఎక్కడికివెళ్ళినా ఒక్కటే. మానవస్వభావంలో ఉన్న ఇరుకు ఎక్కడికివెళ్ళినా ఒక్కటే. మనందరము మరణిస్తున్నాము అనుకొంటున్నాము. ఆమరణానికి మరణం తీసుకొని రావాలి, దానికే సాధన. శరీరానికి మరణం ఉంది, మన హృదయంలో ఉన్న చైతన్యానికి మరణం లేదు. మరణానికి మరణం తీసుకొని రావటం అంటే మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును తెలుసుకొంటే మనకు మరణం లేదు అన్న సంగతి తెలుస్తుంది. అదే మన జీవిత గమ్యం. మనం ఆత్మలోనే ఉన్నాము, చైతన్యంలోనే ఉన్నాము, అందులో సందేహం లేదు. కాని ఆత్మలో ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. అందుచేత దుఃఖం మనలను వెంటాడుతోంది. మనం ఆత్మలోనే ఉన్నాము అన్న సంగతి మనకు తెలియకుండా మన రాగద్వేషములే అడ్డువస్తున్నాయి. రాగం వేరు, దయ వేరు. దయ మంచిదే కాని రాగం మంచిది కాదు. దయకు పరిమితులు లేవు, స్వపర బేధం లేదు. రాగం అంటే మోహం, రాగానికి పరిమితులు ఉన్నాయి. రాగం ఉన్నవాడు పరిమితులలో ఇరుక్కుపోయి ఆ రోజుకారోజు వాడి స్వభావం ఇరుకైపోతుంది. రాగంలో ఉన్నవాడు మరణిస్తూ ఉంటాడు, జన్మిస్తూ ఉంటాడు, వాడు మరణానికి మరణం తీసుకొని రాలేడు.

మనం లేనిపోని విషయాలు ఊహించుకొంటాము. దాని వలన భయం కలుగుతుంది. భయపడవలసిన విషయం అంటూ ఏమీ లేదు. ప్రతీ చిన్నవిషయం కూడా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతోంది. అది మనకు తెలియకభయం కలుగుతోంది. భయంనుండి విడుదల

పొందు, రాగం నుండి విడుదల పొందు అని భగవంతుడు పదే పదే చెప్పాడు. నేను ఏదో గొప్పవాడిని అనుకోవటం వలన, నేను తక్కువవాడిని అనుకోవటం వలన మనిషి పతనమవుతాడు. కొంతమందికి సబ్జక్టుపట్ల సరియైన అవగాహన ఉండదు. ప్రతీచిన్న విషయానికి తిక్కపెట్టుకొంటారు. ఆ తిక్క పెట్టుకొన్న వారు చివరకు పిచ్చివారుగా తయారవుతారు. కొంతమంది మనుషులు ఎలాఉంటారు అంటే వారి అభివృద్ధి వారికి తెలియదు, మనం చెపితే వినరు. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడు కాని మనకు అనుభవంలో లేడు. ఆయన మనకు అనుభవం లోనికి రాకుండా కామక్రోధములే అడ్డువస్తున్నాయి. భగవంతుడు అనుభవంలోనికి రాకుండా మనకు ఏ విషయాలయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన ఉద్దేశింపబడింది. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి మనం అందరం ఈశ్వరానుగ్రహంలోనే ఉన్నాము కాని ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు, అది తెలిస్తే భయరహితస్థితిని పొందుతాము. మనకు అసాధ్యం ఉంది కాని భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. పరిస్థితులు మనకు వ్యతిరేకంగా ఉంటే భగవంతుని దయలేదు అనుకొంటాము, అది కూడా మన మంచికోసమే అలా జరుగుతోంది అని మనకు తెలియక కంగారు పడుతున్నాము. అంటే మనం ఈశ్వరుడి రక్షణలోనే ఉన్నాము, ఆయన దయలోనే ఉన్నాము అని గుర్తింపు మనకు రావటం లేదు. నిజమైనభక్తుడు మాత్రమే అది గుర్తించగలడు, భక్తి లేనివాడికి అది సాధ్యం కాదు. బ్రహ్మం గుణాతీతం అని చెపుతారు. అంటే తమోగుణానికి, రజోగుణానికి, సత్వగుణానికి అతీతం. ఇప్పుడు మనం చేయవలసిన సాధన ఏమిటి అంటే తమోగుణాన్ని, రజోగుణాన్ని తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయాలి. సత్వగుణాన్ని ఎలా తొలగించుకోవాలి అని ప్రయత్నం చేయవద్దు. అలా అనుకొంటే ఇహం చెడుతుంది, పరం చెడుతుంది. సత్వగుణం కూడా గుణమే కాని ఆత్మజ్ఞానసముపార్జనకు అది సహకరిస్తుంది. కురుపు తగ్గిన తరువాత పెచ్చు దానంతట అదే రాలిపోతుంది, బలవంతంగా లాగితే మరల చీముపడుతుంది. సత్వగుణం ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరించి దానంతట అదే తప్పకొంటుంది, దానిని మనం బలవంతంగా లాక్కొంటే ఇహం, పరం రెండూ చెడిపోతాయి. సత్వగుణంలో ఉంటే బాహ్యసంఘటనల ప్రభావం మీ బ్రెయిన్ మీద ఏమీ పడదు. లోకంలో ఏ సంఘటన జరిగినా మీరు ఆఫ్‌సెట్ అవ్వవద్దు. మీ అబ్బాయికి పెళ్ళి అయిన తరువాత మీ మీద కొంచెం ఇష్టం తగ్గుతుంది, భార్య మీద వాడికి ఇష్టం పెరుగుతుంది. ఏమిటి మా అబ్బాయి దూరమయిపోతున్నాడు, మా కోడలుకు దగ్గరయి పోతున్నాడు అని ఏడుస్తూ కూర్చోవద్దు, అది లోకం యొక్క స్వభావం అనుకోండి. అలా ఏడుస్తూ కూర్చొంటే మీ సాధన చెడిపోతుంది. లోకంలో ఎవరికైనా మీరు ఉపకారం చేసారు అనుకోండి వారందరూ కృతజ్ఞతగా ఉండాలని అనుకోవద్దు. వారందరూ మీకు ఉపకారం చేయనక్కరలేదు. మీకు తాటాకులు కట్టకుండా ఉంటే సరిపోతుంది. వారు అందరూ కృతజ్ఞతగా ఉండాలి అని మీరు అనుకొంటే లోకం

**05-02-2003**



యొక్క పోకడ మీకు తెలియటంలేదు అని అర్థం. లోకం కుక్కతోకలాంటిది, కుక్కతోక వంకర ఎవడు తీయగలడు. అందుచేత లోకం యొక్క గొడవ వద్దు. మీకు చేతనయినంత మంచి చేయండి, అది కూడా నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయండి. ఈశరీరం మరణించాక కొంతమంది పుణ్యలోకానికి, కొంతమంది పాపలోకానికి వెళ్ళవచ్చు. అవి అన్నీ మీ పుణ్యం, మీ పాపం అనుభవించటానికి ఉన్నాయి కాని ఆలోకాలు ఏమీ మీకు సాధనకు పనికిరావు. ఇది అర్థం చేసుకోండి. ఆలోకాలలో పుణ్య, పాపాలు అనుభవిస్తారు. మరల సాధన చేసుకోవటానికి ఈ భూమి మీదకు రావలసిందే, శరీరం ధరించవలసిందే. శరీరం మరణించాక ఏదోచేద్దాము అని అనుకోవద్దు. మన సాధనకు పనికివచ్చే లోకం ఈ భూమి ఒక్కటి మాత్రమే. అందువలన ఇక్కడ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీ సాధనకు ఉపయోగించుకోండి. ఇక్కడే మనం ప్రయత్నంచేసి ఈశరీరానికి మరణం రాకముందే మరణంలేనిస్థితిని పొందాలి. శరీరం మరణించిన తరువాత మనం చేసేది ఏమీ లేదు.

మనం ట్రైనింగ్ పొందటానికి ఈలోకంలోనికి వచ్చాము. ఏదో కాలేజీలో చేరితే అక్కడ ఉండిపోముకదా. చదువు పూర్తిచేసుకొని వచ్చేస్తాము. అలాగే ఈ లోకంలోనికి వచ్చినందుకు ట్రైనింగ్ అయ్యి బయటకుపోవాలి. ప్రస్తుతం మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యాలి. సత్వగుణం లేకపోతే సంపాదించుకోవాలి, ఉంటే దానిని అభివృద్ధి చేసుకోవాలి. సత్వగుణంలో ఉన్నవాడికి మనోనిగ్రహం వస్తుంది. మనోనిగ్రహం రాకపోతే మనస్సుకు లోచూపు రాదు. దానికి లోచూపు వస్తే గాని లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రాదు. ఈ మధ్య ఒక భక్తుడు నాతో మాట్లాడుతూ రోజూ దేవుడిని ప్రార్థిస్తున్నాను అని చెప్పాడు. భగవంతుడిని ఏమైనా అడుగుతున్నావా అని అడిగాను. ఏమీ అడగటం లేదు అని చెప్పాడు. ఏదైనా అడగవచ్చు కదా అంటే మీరు అడగమంటే అడుగుతాను అన్నాడు. ఏమని అడుగుతావు అంటే ఈ ప్రార్థించే వాడు శేషం లేకుండా పోవాలి అని ప్రార్థిస్తాను అని చెప్పాడు. కొంతమంది నిన్ను పొగిడేవారు, కొంతమంది నిందించే వారు ఉంటారు. అప్పుడు నీవు మనస్సును సమానంగా ఉంచుకోవాలి. నీకు ఆధ్యాత్మిక బలం ఎంతఉందో తెలుసుకోవటానికి భగవంతుడు పరీక్షలు పెడుతాడు, అంతేగాని నిన్ను పాడుచేయటానికి కాదు. మీ జీవితంలో ఏసంఘటన జరిగినా అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు, అందుచేత కంగారుపడవద్దు. ఏదో అయిపోతుంది అని భయపడవద్దు. అంతా ఆత్మే, ఆ దృష్టి మనకు వస్తే ఎవరిని ద్వేషిస్తాము, ఎవరికి అపకారం చేస్తాము. అఖండదృష్టి, అబేధదృష్టి మనకు రావటంలేదు, అది వస్తే గాని ఆత్మజ్ఞానం కలుగదు. మీ కుటుంబాన్ని విడిచిపెట్టి సంవత్సరానికి 15 రోజులు బయటకు వెళితే అప్పడు అసలు మీకు మోహం ఉందాలేదా, బంధం ఉందా లేదా అని తెలుస్తుంది. మీ మనస్సులో ఉన్న బలహీనతలు తెలుస్తాయి, ఇంటిదగ్గర ఉంటే తెలియదు. మనం 24 గంటలు జపధ్యానములు చేయలేముకదా. అందుచేత ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూఉంటే అది కూడా జ్ఞానసముపార్జనకు మనకు సహకరిస్తుంది. ఇది గుర్తు పెట్టుకోండి.

**రమణ భాస్కర**

రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే ముందు మీరు చీమలుగా ఉండటం నేర్చుకోండి అనిచెప్పాడు. ఇసుక, పంచదార కలిపి ఒకచోట పడవేస్తే పంచదార పట్టుకొనిపోతాయి, ఇసుకను వదిలేస్తాయి. లోకం అంటే మంచి చెడ్డల మిశ్రమం. కేవలం మంచి ఉండదు, కేవలం చెడు ఉండదు. రెండూ ఉంటాయి. నీవు మంచిని తీసుకో, చెడ్డను వదిలేయ్యి. మీరు స్వర్వకాల సర్వావస్థలలో, మీరు ఎక్కడ ఉన్న, పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీ శాంతిని పాడుచేసుకోవద్దు. ఎవడి జీవితం సమానంగా ఉండదు, హెచ్చుతగ్గులు ఉంటాయి, వాటిలో నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి, శాంతిని కాపాడుకోవాలి. మీరు దొంగనేను, మిధ్యానేను అని చెపుతున్నారు, దాని మూలం మీలోపలే ఉంది, అక్కడే భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు. అక్కడికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే దొంగనేనే అడ్డువస్తోంది అంటున్నారు. అది అడ్డు వచ్చేమాట నిజమే ఎందుచేతనంటే దాని మూలంలోనికి వెళితే అది నశిస్తుంది, అందుచేత దొంగనేనే అడ్డువస్తుంది, అది పోవటానికి అది ఇష్టపడదు. అందుచేత మిధ్యానేనును ప్రక్కన పెట్టి, దానికి అతీతంగా ఉండి ఆ మూలాన్ని మనం చూడాలి, అప్పడు మీకు మూలం వ్యక్తమవుతుంది. దొంగనేనును అడ్డురానివ్వకూడదు, దాని గొడవ వదలుకోవాలి. దానిని మర్చిపోతే ఏమీలేదు. మీరు జరిగిపోయిన గొడవలు అంటే భూతకాలం అంతా మర్చిపోండి. మీరు శాంతిగా ఉండగలుగుతారు. జరిగిపోయిన సంఘటనలు తలపెట్టుకోవటం వలన సాధన సాగదు, రజోగుణం పెరుగుతుంది. మీకు లోచూపురాదు, భగవంతుడికి దూరమవుతారు. మిమ్మల్ని ఎవరైనా అవమానం చేసారు అనుకోండి, దానిని తలపెట్టుకొంటూ ఉంటే వారి మీద ప్రతీకారం తీర్చుకోవాలి అనిపిస్తుంది. దానిని మర్చిపోండి, వారి సంగతి భగవంతుడే చూసుకొంటాడు. జీవితంలో అన్నీ తలంపులే. తలంపు వచ్చినప్పడు అది ఎక్కడ నుండి వస్తోంది, దాని మూలం ఎక్కడ ఉంది అని దాని మూలాన్ని చూడటానికి ప్రయత్నంచేస్తే తలంపు పారిపోతుంది. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నీ పాడుబుద్ధికి జ్ఞానం రాదు నన్ను ఆరాధించగా ఆరాధించగా, నాకు ఇష్టమైన పనులు నీవుచేస్తూఉంటే, నాయందు గౌరవం కలిగిఉంటే, నేను చెప్పిన మాటలను అర్థంచేసుకొని ఆచరించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే నీ పాడుబుద్ధిని తొలగించి, నీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే నేను అనుభవంలోనికి వస్తానో అటువంటి బుద్ధిని నీకు ప్రసాదిస్తాను అని చెప్పాడు. మనం భక్తిని విడిచిపెట్టకూడదు, భక్తి జ్ఞానాన్ని తీసుకొని వస్తుంది. నీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో, ఆ దొంగ నేను యొక్క మూలాన్ని చూడటమే, దానిని తొలగించుకోవటమే విచారణమార్గం యొక్క లక్ష్యం. నీకు ఎవరైనా సంతోషం కలిగించేమాటలు, దుఃఖం కలిగించేమాటలు చెప్పవచ్చు. సంతోషం కలిగించే మాటలు చెప్పినప్పడు సంతోషం ఎవరికి వస్తోంది. దుఃఖం కలిగించే మాటలు చెప్పినప్పడు దుఃఖం ఎవరికి వస్తోంది? ఈ రెండూ దొంగనేనుకే వస్తున్నాయి. ఈ రెండూ వదిలేయమంటున్నారు భగవాన్. మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు అందుతూ ఉంటే బాహ్యసంఘటనలు ఎలా ఉన్నా, మీ కుటుంబపరిస్థితులు ఎలాఉన్నా కూడా మీ మనస్సు చెదరదు. రమణమహర్షిలో ఏమీ విశేషం లేదు అని మీరు అంటారు అనుకోండి మా మనస్సు చెదరదు. ఎవరి రక్షణలో మేము ఉన్నామో, ఎవరి అనుగ్రహం వలన మాకు జ్ఞానం కలుగుతోందో వారిలో విశేషం లేదు అంటే ఎలా నమ్ముతాము. పంచదారలో తీపి లేదు అని మీరు చెపితే నమ్మేటంత అమాయకులం కాదు. ఎందుచేతనంటే పంచదార ఆల్‌రెడీ రుచి చూసాము. ఏమండీ మాకు ఒకోసారి సంతోషం ఉంటుంది, ఒకోసారి సంతోషం ఉండటంలేదు అని భగవాన్‌తో అంటే ఆ సంతోషం ఎవరికి వస్తోందో చూడు. ఆ నేనును అర్థం చేసుకొంటే సంతోషం ఉన్నా ఒకటే, పోయినా ఒకటే అన్న సంగతి నీకు తెలుస్తుంది అని చెప్పారు. దేహం చనిపోయినప్పడు ఏ నేను అయితే బాధపడుతుందో ఆ నేను నీకు అర్థమయితే దేహం యొక్క చావుకు కూడా ఏమీ ప్రాధాన్యత ఉండదు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళి ఆ హృదయస్థలంలో మనస్సును నిలబెట్టి ఉంచటమే యోగం, అదేభక్తి, అదేజ్ఞానం, అదేకర్మ. నిన్ను నీవు తెలుసుకోవటానికి ఉపయోగపడేది కర్మకాకపోతే ఏది కర్మ, జ్ఞానసముపార్జనకు ఒక పని ఉపయోగపడుతూ ఉంటే అది పనికాకపోతే ఏది పని. మాలో దేవుడు ఉన్నాడు కదా అంటే ఉన్న మాట నిజమే. అయితే అది అనుభవంలో ఉందా అంటే భగవదనుభవం మనకు లేదు. ఇది బాగాఅర్థం చేసుకోండి. బుడగ బుడగగా నిజంకాదు బుడగ నీరుగా నిజం. బుడగను నీరుగా చూస్తారు అనుకోండి వికారాలు రావు. మీరు నామరూపములకు ఆధారంగా ఉన్న వస్తువును చూడటం మానేసి మీ దృష్టి నామరూపములకు పరిమితమైతే మీరు బంధింపబడతారు, మీకు లోచూపురాదు. ఆత్మజ్ఞానంకలుగదు. అందరిలోను అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం చూడలేక పోతున్నాము, మన దృష్టి నామరూపాలకు పరిమితమైపోతోంది. నోటితో అందరిలోను ఈశ్వరుడు ఉన్నాడుఅంటున్నాము కాని అనుభవంలో లేదు. నామ రూపదృష్టిలోనుండి విడుదలపొందితేగాని నామరూపములకు ఆధారంగా ఉన్న వస్తువు అనుభవంలోనికి రాదు. మనం ఎంతసేపు నామరూపములతో ఉంటున్నాము. గోడమీద పేర్లు పెట్టటం గురించి పేచీలుపెట్టుకొనే వారు చాలామంది ఉన్నారు. ఇది అంతా అజ్ఞానం కాకపోతే ఏమిటి? దీనివలన నీకు జ్ఞానం వస్తుందా? నువ్వు పని చెయ్యి ఎలా పని చేస్తే నీకు జ్ఞానం కలుగుతుందో అలా పనిచెయ్యి అంతేగాని నీవు చేసే పద్ధతిలో పనిచేస్తే నీకు జ్ఞానం రాదు, అది కర్మయోగం కాదు. లోకంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. సమాజపరంగా, కుటుంబపరంగా అనేక సమస్యలు వస్తూఉంటాయి. ఆ సంఘటనలు జరిగినప్పడు ఒకోసారి సంతోషం, ఒకోసారిదుఃఖం వస్తుంది. భగవాన్ చెప్పేదిఏమిటి అంటే ఆ సంఘటనలను జరగనివ్వండి, అది ప్రకృతి. ఆ సంఘటన జరిగినప్పడు సంతోషంవస్తే పొంగిపోయే ఆ నేను ఎవరు? దుఃఖంవస్తే కృంగిపోయే ఆ నేను ఎవరు? ఆనేనును మీరు అర్థంచేసుకొంటే, ఆనేనును మీరు పరిశీలిస్తే దానిని విచారణ చేస్తే, ఆనేనును శోధించి శోధించి దాని మూలాన్ని చూస్తే మీకు సిద్ది కలుగుతుంది. నేనును శోధించి, శోధించి దాని మూలాన్ని సాధించండి, అప్పడు మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు మీకు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు


| | | |
|---|---|---|
| 08-02-2003 | శనివారం | చించినాడ గీతా మందిరం |
| 19-02-2003 | బుధవారం | గణపవరం సాయిబాబా మందిరం |
| 23, 24-02-03 | ఆది, సోమ | సఖినేటిపల్లి, గీతా మందిరం |
| 26-02-2003 | బుధవారం | శివదేవుని చిక్కాల |

### నిన్నటి పొరపాట్లే - నేటి పాట్లుకు కారణం

జీవుడు తన వాహనమైన శరీరంతో యీ జగత్తు అనే సంసార సాగరంలో, అనేక జన్మలలో తనకు అనుభంధం కల్పించబడిన వ్యక్తులతో కూడి అనుభవాలను గడిస్తూ, ఆకర్షణలను పోగుజేసుకొంటూ, రాగద్వేషాలను పెంచుకొంటూ వాటిని వాసనల రూపంలో, ఆగామి, సంచితం, ప్రారబ్దమనే సంచుల్లో నిల్వజేసుకొని, జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాడు. ప్రస్తుతం మనకు తారసపడ్డ కష్ట సుఖాలు అన్ని గతజన్మలలో సంపాదించినవే, ఈ నగ్న సత్యాన్ని గ్రహిస్తే ఆ సంకటాలను ధైర్యంగా - శాంతంగా స్వీకరించి సుఖంగా జీవించవచ్చును. ప్రారబ్ధ కర్మనే విల్లునుంచి వదలి పెట్టిన బాణం అంటారు. అది గమ్యాన్ని చేరుతుంది. దాన్ని ఎవరూ ఆపలేరు. వివేకానంద ఇలా అంటారు " ప్రశ్న వేయటమే గాని, సమాధానం కోరుకొనే అధికారం మనకు లేదు, అంతా ఈశ్వరేచ్ఛ దానికి లొంగి ఉండవలెను, నోరెత్తరాదు సర్వమూ దైవమిప్పటికే నిర్ణయించాడు. వచ్చు విపత్తులను ప్రశాంత బుద్ధితో అనుభవించాలి, లేదా ఘోర కష్టాలు విధించబడును" అని. ఈ సంపూర్ణశరణాగతిని అనుసరిస్తే "ఏది జరిగినా ఎవరినీ నిందించవలసిన పనిలేదు. మన కర్మలే మనకు ఎదురౌతాయి. ఎంతచేసామో అంతా అనుభవించాలి. దుఖఃకరమైన ఒక పాఠం నేర్పటానికే దుఃఖం వస్తుంది. వేదాలసారాన్ని అంతా కాళిదాసు ఒక్కమాటలో యిలా అన్నారు. "చేతనైతే ఉపకారం చెయ్యి - అపకారం చెయ్యకు, తరిస్తావు." చాలామంది జరిగిన అపకారానికి ప్రతీకారం మన కళ్ళముందే తీర్చుకోవటంలోనే ఆనందం ఉందని భ్రమపడి ప్రతీకార చర్యలతో మరల కర్మసముద్రంలో పడి శాశ్వతగతిని నిరోధించుకొంటారు. ఫలితాలు లెక్కలు వేసుకొని కలత చెందకుండా వాటి యందు నిస్పృహ గలవాడే నిజమైన సుఖి, గత కాలాన్ని భవిష్యత్తును స్మరిస్తూ ఉండేవాడికి లోచూపు ఉండదు" అన్నారు భగవాన్. గతకాలానికి కాంక్రీటు గోడ కట్టాలి, వాటితో జీవిస్తే ఘర్షణ తప్పదు. జీవితంలో సామరస్యతను అలవర్చుకోవాలి. "నీ ఇచ్ఛయే నెరవేరుగాక" అనే ప్రార్ధన మన హృదయం నుండి రావాలి. కుమ్మరి కుండను ఒక సంవత్సరంపాటు కష్టపడి ఎన్నెన్నో నగిషీలతో రంగులతో అందంగా తీర్చిదిద్దినా, ఒక్క తన్నుతో పగిలి నామరూపాలు లేకుండా పోతుంది. అలాగే మన గతజన్మల కర్మబంధనాలు అన్నీ సద్గురు ఒక్క కరుణా కటాక్షంతో తెగిపోతాయి. సాధకుడు, సహనంతో సాహచర్యం చెయ్యాలి. అది ఉందా జీవితం సఫలమౌతుంది.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

## మల్కిపురంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం





మలికిపురం, జనవరి 21 (న్యూస్‌టుడే) : మలికిపురంలోని ప్రతిష్ఠాత్మక శ్రీ షిరిడీ సాయిబాబా చతుర్ధ వార్షికోత్సవ వేడుకలు మంగళవారంఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి శ్రీసాయిబాబా వారికి సహస్ర కలశక్షీరాభిషేకం జరిగింది. 1001 కలశాలతో భక్తులు బాబా విగ్రహాన్ని ఆవుపాలతో అభిషేకించారు. దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్ధం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాజోలు ఎమ్మెల్యే శ్రీ ఎ.వి. సూర్యనారాయణరాజు, రాజోలు కాంగ్రెస్ నాయకుడు శ్రీ అల్లూరి కృష్ణంరాజు, శ్రీ కె.వి. రామకృష్ణంరాజు (చంటిరాజు), శ్రీ రుద్రరాజు సత్యనారాయణ రాజు, సర్పంచి, శ్రీ చెల్లుబోయిన వెంకటలక్ష్మణరావు, శ్రీ కంతేటి వెంకట్రామరాజు, శ్రీ ముదునూరి లింగరాజు, తదితర ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి సాయిబాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు ఆధ్యాత్మిక ప్రవచనం చేసినారు.